## నేటి నుంచి పోలీస్ యాక్ట్ 30, 30(ఎ)అమలు

- ఎస్పీ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఎస్పీ వెంకటేశ్వర్లు

నారాయణపేట, అక్టోబర్ 1: శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో సోమవారం నుంచి ఈనెల 31 వరకు పోలీస్ యాక్టు 30, 30(ఎ) అమలులో ఉంటుందని ఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీస్ యాక్టు అమలులో ఉన్నందువల్ల పోలీసు అధికారుల అనుమతి లేకుండా ప్రజలు ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. అదేవిధంగా శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే విధంగా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకోవాలి

- తాసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్



వృద్ధులను సన్మానిస్తున్న తాసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్

నారాయణపేట టౌన్, అక్టోబర్ 1: 18ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తాసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఆర్డీవో కార్యాలయంలో 80 ఏండ్లు పైబడ్డ వృద్ధులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు ఎంతో విలువైనదన్నారు. ఓటు విలువ తెలిపేలా ప్రభుత్వం ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నదన్నారు. వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసీల్దార్లు నారాయణ, బాలరాజు, ఆర్‌ఐలు శ్రీనివాసులు, ప్రతాప్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సత్తా చాటిన పేట క్రీడాకారులు

నారాయణపేట, అక్టోబర్ 1: కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో పేట క్రీడాకారులు సత్తా చాటారు. పురుషుల 20 విభాగంలో లాంగ్ జంప్‌లో మురళి గోల్డ్ మెడల్, సాయికుమార్‌రెడ్డి సిల్వర్ మెడల్ సాధించారు. అండర్ 20 విభాగంలో పరుగుపందెంలో మహేశ్ సిల్వర్ పతకం, డిస్కస్ త్రోలో శివ కాంస్య పతకం సాధించారు. హైజంప్, హర్డిల్స్‌లో జనార్దన్ రెండు బంగారు పతకాలు, అండర్ 18 విభాగంలో జావెలిన్‌త్రోలో రవికుమార్ కాంస్య పతకం సాధించాడు. పతకాలు సాధించిన క్రీడాకారులను అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు నందూ నామాజీ, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నర్సింహులు, కోచ్‌లు జగదీశ్, భరత్, హరికాదేవి తదితరులు అభినందించారు.

## జిల్లాలో మోస్తరు వర్షం

నారాయణపేట, అక్టోబర్ 1: జిల్లాలోని వివిధ మండలాల్లో శనివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. మక్తల్ మండలంలో అత్యధికంగా 17.2 మిల్లీమీటర్ల వర్షం కురువగా దామరగిద్ద, ఊట్కూర్ మండలాల్లో అత్యల్పంగా 1.0 మి.మీ వర్షం కురిసింది. అదేవిధంగా నారాయణపేట మండలంలో 6.6 మి.మీ, మాగనూర్‌లో 1.2 మి.మీ, కృష్ణ లో 2.6 మి.మీ, నర్వలో 4.2 మి.మీ, మరికల్ మండలంలో 11.4 మి.మీ, ధన్వాడ మండలంలో 6.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయినట్లు అధికారులు తెలిపారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నారాయణపేట రూరల్, అక్టోబర్ 1: పేట మండలంలోని జాజాపూర్ గ్రామంలో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం సర్పంచ్ సుగుణమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శేఖర్, రైతు బంధు సమితి జిల్లా సభ్యుడు కొట్ల జగన్మోహన్‌రెడ్డి,నాయకులు వెంకటప్ప, కనకప్ప, నారాయణరెడ్డి, ఆనంద్, అనిల్, నరేందర్, రహీం, వెంకటేశ్, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట, అక్టోబర్ 1: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్ వేమారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. 01-8-2023 నాటికి 14 ఏండ్లు పూర్తై 10 లేదా 8వ తరగతి పూర్తయిన విద్యార్థులు http://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థుల మెరిట్ ఆధారంగా ప్రవేశం కల్పించడం జరుగుతుందన్నారు.

# పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- ఊరూరా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం
- శ్రమదానం చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు, యువకులు,

నారాయణపేట టౌన్, అక్టోబర్ 1: ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని 10వ వార్డు కౌన్సిలర్ మేఘా కులకర్ణి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మేఘా కులకర్ణి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల రోగాల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ, చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు, ఈగలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటుందన్నారు. వృక్షాలను తొలగించి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపు నిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, ఆర్‌పీలు పాల్గొని వీధుల్లో చెత్తా చెదారం తొలగించి శుభ్రం చేశారు.

**పేట మండలంలో...**

నారాయణపేట రూరల్, అక్టోబర్ 1: స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా పేట మండల లోని అప్పక్‌పల్లి, జాజాపూర్, సింగారం, ఊటకుంటతండా, కొల్లంపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. అప్పక్‌పల్లిలో డీపీవో మురళి, డీఎల్పీవో సుధాకర్, ఎంపీడీవో వెంకటయ్య, ఎంపీవో బాలాజీ, సర్పంచ్ వెంకటమ్మ, పంచాయతీ కార్యదర్శి జగదీశ్ ,ఎఫ్ఎ నర్సింహారెడ్డి తదితరులు శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళాసంఘాల సభ్యులు రోడ్లను శుభ్రపర్చారు. జాజాపూర్‌లో సర్పంచ్ కొట్ల సుగుణమ్మ, రైతు బంధు సమితి జిల్లా సభ్యులు కొట్ల జగన్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ శేఖర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామస్తులు శ్రమదానం చేసి రోడ్లు శుభ్రం చేయడంతో పాటు ఇరువైపులా పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించారు. సింగారంలో సర్పంచ్ జయంతి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు శ్రమదానంలో పాల్గొన్నారు. ఊటకుంటతండాలో సర్పంచ్ సీతమ్మ, కొల్లంపల్లిలో సాయిరెడ్డి , పంచాయతీ కార్యదర్శులు,ఎంపీటీసీలు,మహిళలు శ్రమదానంలో పాల్గొన్నారు.

**మక్తల్‌లో...**

మక్తల్ అర్బన్, అక్టోబర్ 1: పట్టణంలోని లయన్స్ క్లబ్ సేవా భవన్‌లో క్లబ్ అధ్యక్షుడు అంబాదాస్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన క్లబ్ సభ్యులతో కలిసి లయన్స్ క్లబ్ పరిసరాల్లో కంప చెట్లను తొలగించి శుభ్రం చేశారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా మున్సిపాలిటీ వాహనంలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు అనుగొండ శ్రీనివాసులు, నరేందర్, పృథ్వీరాజ్, అశోక్, శేఖర్, కోళ్ల వెంకటేశ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**కర్ని పీహెచ్‌సీలో...**

మక్తల్ టౌన్, అక్టోబర్ 1: మండలంలోని కర్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ఆరోగ్య కేంద్రం ఆవరణ శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వైద్యుడు తిరుపతి మాట్లాడుతూ మనం స్వచ్ఛత పాటిస్తేనే సంపూర్ణ ఆరోగ్యంతో జీవించగల్గుతామన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్ర ఆవరణలో హరితహార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రోజా, సందీప్, సులోచన, జ్యోతి, సత్యనారాయణమ్మ, లలిత, హబీబ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

**మరికల్‌లో...**

మరికల్, అక్టోబర్ 1: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా యువకులు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా రోడ్డు శుభ్రం చేసి చెత్తా చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో సర్పంచ్ కస్ని గోవర్దన్ , యువకులు భాస్కర్‌రెడ్డి, నారా కొండయ్య, తిరుపతి రెడ్డి, వేణుగోపాల్, రమేశ్, శ్రీరాం, నరేశ్‌గౌడ్,వెంకటేశ్, విజయ్‌కుమార్ రెడ్డి, నరేశ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, ఏపీఎం చంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

**ధన్వాడలో...**

ధన్వాడ, అక్టోబర్ 1 : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవాకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గోవర్ధన్ గౌడ్, బాలరాజు, మాధవి, గోటూర్ సర్పంచ్ నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ వెంకట్‌రెడ్డి పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

**పగిడిమర్రిలో..**

ఊట్కూర్, అక్టోబర్ 1: మండలంలోని పగిడిమర్రిలో ఆదివారం గ్రామస్తులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సులోచనమ్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ షహనాజ్ బేగం, ఉప సర్పంచ్ మహబూబ్‌అలీ, నాయ కులు మురళీధర్‌రెడ్డి, విష్ణుమూర్తి గౌడ్, జాఫర్, ఇస్మాయిల్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

**కృష్ణలో...**

కృష్ణ, అక్టోబర్ 1 : మండల కేంద్రంతో పాటు గుడెబల్లూర్, ముడుమాల్ తదితర గ్రామాల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు రోడ్లు, వీధులు, పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



పేటలో పరిసరాలను శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది, మహిళలు



మక్తల్‌లో శ్రమదానంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్



పేట మండలం అప్పక్‌పల్లిలో శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్న డీపీవో



కర్ని పీహెచ్‌సీలో పరిసరాలను శుభ్రం చేస్తున్న వైద్య సిబ్బంది



మరికల్‌లో చెత్తను తొలగిస్తున్న యువకులు, పంచాయతీ సిబ్బంది




ఊట్కూర్ మండలం పగిడిమర్రిలో శ్రమదానం చేస్తున్న గ్రామస్తులు

**మాగనూర్‌లో...**

మాగనూర్ అక్టోబర్ 1: మాగనూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని వీధులు, పాఠశాలల ఆవరణల్లో శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీవో జైపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ మంత్రి ఎల్లారెడ్డి జయంతి

ఊట్కూర్, అక్టోబర్ 1 : మాజీ మంత్రి, స్వర్గీయ ఎల్కోటి ఎల్లారెడ్డి జయంతిని ఆదివారం మండలకేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లా డుతూ ఎల్లారెడ్డి పేదల అభ్యున్నతి కోసం నిరంతరం పరితపించారని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి, సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అరవింద్‌కుమార్, మాజీ విండో చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు జగదీశ్‌గౌడ్, నాసీర్‌ఖాన్, మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

## క్రిష్టియన్ సమన్వయ కర్తల నియామకం

నారాయణపేట రూరల్, అక్టోబర్ 1: ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి పేట నియోజకవర్గ క్రిష్టియన్ సమన్వయ కర్తలను నియమించారు. పాలమూరు పార్లమెంట్ పరిశీలకులు కాశపోగు ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కర్తలుగా వినోద్‌కుమార్, రాము, దత్తు, పాస్టర్ జీవన్‌కుమార్, శంకరప్ప, రవికుమార్‌లను నియమించారు. ఈ సందర్భంగా కాశపోగు ప్రసాద్ మాట్లాడుతూ నియోజక వర్గంలోని అన్ని మండలాలలో కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీ బడుగు,బలహీనవర్గాల, పేదలకు అండగా ఉంటూ పేదరిక నిర్మూలనకు సహకరిస్తుందన్నారు. నూతన కమిటీ సభ్యులు కాశపోగు ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు